సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 29 । జూన్ । 2023



ఘనంగా తాళ్లపాక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తాళ్లపాకలో వెలసిన శ్రీ చెన్నకేశవ, శ్రీ సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ పూజలు నిర్వహించారు. -8లో



గండికోట జలాలతో తాగునీటి సమస్య పరిష్కారం

గండికోట జలాశయం నీటితో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.690	రూ.820
రెండోరకం	రూ.480	రూ.680



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1397 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	362	380
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 126.16 కిలోలు

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె సిటీ: యువజన సర్వీసుల శాఖ, విజయవాడ ఉత్తర్వుల మేరకు 2024 పద్మ అవార్డులకు అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సెట్ప్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్‌డీఓ షేక్ షఫీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవా రంగంలో అర్హులైనవారు పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెట్ప్ మేనేజర్ సుబ్బరాయుడును 9949298810 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా కేజీబీవీలలో టీచింగ్ ఫ్యాకల్టీకి సంబంధించి గురు, శుక్రవారాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 131 పోస్టులకు ఇప్పటి వరకు సర్టిఫికెట్లు పరిశీలన చేసి 1:3 నిష్పత్తిలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. కడపలోని మున్సిపల్ హైస్కూల్ గాంధీనగర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, సంబంధిత అభ్యర్థులకు ఇప్పటికే ఫోన్ ద్వారా తెలియజేశామన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ఈ నియామకాలన్నీ మెరిట్ ప్రాతిపదికన పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఇసుక సరఫరా



ఇసుక రీచ్‌ల నిర్వహణపై అధికారులతో సమీక్ష చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఇసుక నిరంతరాయంగా సరఫరా చేసేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో అధికారులకు సూచించారు. బుధవారం మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లాలో ఇసుక లభ్యత, సరఫరా గురించి జాయింట్ కలెక్టర్ అధికారులతో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు అవసరం మేరకు ఇసుక సరఫరా చేయాలన్నారు. సమీపంలోని ఇసుక రీచ్‌ల నుంచి సరఫరా అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. ఇసుక కొరత లేకుండా నిర్మాణ పనులను సజావుగా సాగాలే చూడాలన్నారు. అధికారులందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైన్స్ అధికారి రవిప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమూర్తి, డీపీఓ ధనలక్ష్మి, గ్రౌండ్ వాటర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి
విద్యార్థులకు వరం

- మనిషి తలరాతను మార్చడం చదువుకే సాధ్యం
- పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదు
- నాలుగో విడత అమ్మ ఒడి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ ఛైర్మన్, డీఈఓ తదితరులు

రాయచోటి : మనిషి తలరాతను మార్చడానికి ఒక చదువుకు మాత్రమే సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి విద్యార్థులకు వరంలాంటిదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి అమ్మ ఒడి పథకం కింద 2022–23 సంవత్సరానికి సంబంధించి వరుసగా నాల్గవసారి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదును జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ ఛైర్మన్ ఫయాజ్‌అహ్మద్, డీఈఓ పురుషోత్తం, డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లులు తదితరులు తిలకించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చదువుకు పేదరికం ఎప్పుడూ ఆటంకం కాకూడదన్న గొప్ప ఆలోచనతో సీఎం వైఎస్ జగన్ అమ్మ ఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ క్రమంలో నాలుగో ఏడాది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 1,52,366 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ. 228,54,90,000 కోట్ల మొత్తాన్ని నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాల మౌలిక వసతులతో కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతున్నామన్నారు. విదేశీ విద్య కార్యక్రమం ద్వారా ఇతర దేశాలకు వెళ్లి చదువుకోవడానికి కూడా ప్రభుత్వం సహకరిస్తుందని తల్లిదండ్రులందరూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇంగ్లీష్‌లో చాలా చక్కగా మాట్లాడుతున్నారన్నారు. ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద ఎత్తున విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదని జేసీ అభిప్రాయపడ్డారు. జగనన్న విద్యాకానుక, జగనన్న వసతిదీవెన వంటి అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇలాంటి మంచి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

- మునిసిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేశారన్నారు. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి విద్యకు దూరమయ్యే పరిస్థితి రాకూడదన్న ప్రధాన ఉద్దేశ్యంతో జగనన్న అమ్మ ఒడి రూపొందించారన్నారు. పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించడతో పాటు ప్రతి బడి ఈడు పిల్లవాడు బడిలోనే ఉండాలని వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారన్నారు. జగనన్న అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా వరుసగా నాలుగో ఏడాది అమ్మ ఒడి నిధులు తల్లుల ఖాతాలకు జమచేయడం జరిగిందన్నారు. విద్యాభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యపైనే ప్రత్యేక దృష్టి పెట్టి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు.

మెగా చెక్కు అందజేత

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున 1,52,366 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.228,54,90,000 మొత్తానికి సంబంధించి మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు ముఖ్య అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

వైభవంగా ధ్వజారోహణం

- యాళీవాహనంపై ఊరేగిన సౌమ్యనాథుడు
- రూ.50 లక్షలతో వసతుల కల్పన
- టీటీడీ జేఈఓ సదాభార్గవి వెల్లడి



యాళీవాహనంపై దర్శనమిస్తున్న సౌమ్యనాథుడి వద్ద భక్తజనం



సౌమ్యనాథాలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

నందలూరు (రాజంపేట): ప్రసిద్ధి చెందిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం వైభవంగా ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణలు , మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ గురుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. అనంతరం ఆస్థానం ఘనంగా జరిగింది. శ్రీసౌమ్యనాథస్వామి, ధ్వజపటం, చక్రతాళ్వార్, పరివారదేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాఢవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ భార్గవి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి , జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అరిగెల నాని, పునగాని గుణ యాదవ్, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, తుమ్మల శ్రీధర్ గౌడ్, పసుపులేటి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

- సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రూ.50 లక్షలతో భక్తులకు వసతుల కల్పన చేసినట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి అన్నారు. ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. మూలవిరాట్‌తోపాటు వాహనసేవలను భక్తులు సంతృప్తిగా దర్శించుకునేందుకు వీలుగా విస్తృతంగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. త్వరలో ఆర్కియాలజీ డిపార్టుమెంట్ అనుమతులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు. కాగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు హరికథ కాలక్షేపం నిర్వహించారు.

యాళివాహనంపై..

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి యాళీవాహనంపై సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి యాళీవాహనంపై ఆసీనులు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. యాళీ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. భక్తులు కాయాకర్పూరం సమర్పించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా పలువురు ఉన్నతాధికారులు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.

జిల్లా ఆస్పత్రికి 200 పడకల సామర్థ్యం



జిల్లా ఆస్పత్రిలో భవన నిర్మాణాలకు స్థలాలను పరిశీలిస్తున్న, మురళీధర్‌రెడ్డి

మదనపల్లె: మదనపల్లె మెడికల్ కళాశాలకు అనుబంధంగా వైద్యసేవలను అందించేందుకు జిల్లా ఆస్పత్రిలో 200 పడకల సామర్థ్యం కలిగిన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆరోగ్యవరంలో మెడికల్ కాలేజి ఏర్పాటవుతున్న స్థలం సందర్శించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో 200 పడకల సామర్థ్యం కలిగిన భవనాలను నిర్మించి వైద్యసేవలు ప్రారంభించేందుకు అనువైన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈలు ధనుంజయరెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, డీఈ కరీముల్లాఖాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రసాద్‌రాజు తదితరులున్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు



రాయచోటిలో బక్రీద్ ప్రార్థనల కోసం ఈద్గాలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని హజరత్ జమాలుల్లాబాష ఈద్గా (నమాజ్‌గిరా)లో ఈదుల్ జుహా (బక్రీద్) పండుగను పురస్కరించుకుని ముస్లిం, మైనార్టీలు ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈద్గా మైదానంలో నిర్వహించే ప్రార్థనల నిమిత్తం మున్సిపల్ అధికారులు ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టారు. ఎంపీ మిధున్‌రెడ్డి నిధులతో ప్రార్థనల కోసం విచ్చేసే వారి సౌకర్యార్థం వజుఖానా నిర్మాణం పనులు వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో పూర్తయ్యాయి. ప్రార్థనల సందర్భంగా ఈద్గాతో పాటు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టిభద్రతా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం ప్రార్థనల కోసం ముస్తాబవుతున్న ఈద్గా ప్రాంగణాన్ని, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఈద్గా కమిటీ కన్వీనర్ బేపారి మహమ్మద్‌ఖాన్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఫయా జుర్ రహిమాన్, , వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలిసి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈద్గా కమిటీ ప్రెసిడెంట్ హాజీ బేపారి బషీర్‌ఖాన్ ఆధ్వర్యంలో బక్రీద్‌ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. మత గురువు, ప్రభుత్వ సర్కాజీ షర్ఫుద్దీన్ సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకే ఆధ్యాత్మిక ప్రార్థనలు ప్రారంభమవుతాయన్నారు. హిందూ– ముస్లిం సోదరులు కలసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలంటూ ఆయన కోరారు. కార్యక్రమంలో వారితో పాటు మాజీ కౌన్సిలర్ అన్నా సలీం, బేపారి జబీవుల్లాఖాన్‌తో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

గాలివీడు: వేరుశనగ విత్తనం వేసే సమయంలో తప్పనిసరిగా శుద్ధి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. వెలిగల్లు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. విత్తనశుద్ధి, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంపై అవగాహన కల్పించారు. భూ సార పరీక్షలు తప్పక నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెవించిన ప్రగతిరాగం

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి నడుంబిగించింది. నవరత్న పథకాల అమలుతో పేదల జీవితాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. విద్యా రంగంలో అమ్మ ఒడి .. విద్యార్థులందరికీ వరంలా మారింది. ఏటా రైతు భరోసా కింద అన్నదాతలకు పెట్టుబడి సాయం అందజేస్తూ రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆర్‌బీకేలను ప్రత్యేకంగా తీర్చిదిద్ది అన్నదాతలు మురిసేలా విశేష సేవలందిస్తోంది. ఇక.. అవ్వాతాతలు మెచ్చేలా వృద్ధాప్య పింఛన్ అందజేస్తూ పండుటాకుల జీవితాలకు భరోసా ఇస్తోంది. వితంతు.. వికలాంగ పింఛన్లు అందజేస్తూ ఆసరాగా నిలుస్తోంది. పేదలందరికీ కులమతాలకు అతీతంగా సొంతింటి కలను సాకారం చేసింది. ఆరోగ్య శ్రీ తో మెరుగైన వైద్య సేవలు అందిస్తూనే.. మరో వైపు పల్లెల లోగిళ్లలో ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో వైద్యం అందజేస్తోంది. ప్రభుత్వ కృషితో పల్లెపల్లెనా ప్రగతి రాగం వినిపిస్తోంది.


- కడప డెస్క్




ఇతని పేరు కొర్లె ప్రసాద్. వైఎస్ఆర్ జిల్లా గోపవరం మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న కాలువకట్టలో నివాసం ఉంటున్నాడు. ఈయన తల్లి వెంకటసుబ్బమ్మ గృహిణిగా ఉండగా, తండ్రి వెంకటన్న ఎద్దుల బండి ఏర్పాటు చేసుకుని ఇసుక తోలకంపై జీవనం సాగిస్తున్నాడు. ఇంత వరకు బాడుగ ఇంటిలో ఉన్న వీరికి బొల్లవరం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు కాగా నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం ఇల్లు తుదిమెరుగులు దిద్దుకొంటోంది. ఈనెలాఖరులో ఇంటిలో తాము చేరుతామని ఈ సందర్భంగా ప్రసాద్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. సొంతింటి కల నెరవేరుతున్నందుకు చెప్పలేనంత సంతోషంగా ఉందన్నారు.



గుర్రంకొండ: రైతులకు సబ్సిడీ ఎరువులు పంపిణీ చేస్తున్న ఆర్బీకే సిబ్బంది (ఫైల్)



ఈమె పేరు భారతి. మదనపల్లె మండలం మద్దినాయునిపల్లెలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు షుగర్ వుంది. గతంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేది. ప్రస్తుతం 104 ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఆమె ఉన్న పల్లెలోనే వైద్యులు పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారు. 'వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి తేవడంతో మాలాంటి వారికి ఎంతో మేలు చేకూరింది. పేదలంతా ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారని' భారతి అంటోంది.




చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పప్పునబోయిన వెంకట సుబ్బమ్మ. ఈమెది వైఎస్ఆర్ జిల్లా కమలాపురం మండలం ఎర్రగుడిపాడు గ్రామం . ఆమె భర్త వెంకట సుబ్బయ్య 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. కూలీ పనులకు వెళ్లి ముగ్గురు కూతుర్లను పెంచి పెద్ద చేసింది. పెద్దకూతురుకు వివాహం కూడా చేసింది. అయితే జగనన్న వచ్చిన తర్వాత వితంతు పింఛన్ పెంచి ఇవ్వడంతో కొంత ఉపశమనం కలిగింది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18750 వస్తోంది. అలాగే తన కూతురుకు టైలరింగ్ ద్వారా ఏటా రూ.10వేలు వస్తోంది. ఈ పథకాలన్నీ రావడంతో మా కుటుంబం సంతోషంగా జీవనం సాగిస్తోందని వెంకట సుబ్బమ్మ చెబుతోంది.



ఈమె పేరు నాగరత్న. సంబేపల్లె మండలంలోని గొగ్గువారిపల్లెలో ఉంటోంది. ఈమె కుమారుడు బొగ్గువారిపల్లె ప్రభుత్వ పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్నాడు. ఆమె కూలి పనులు చేసుకుంటూ కొడుకును చదివి స్తోంది. అమ్మ ఒడి పథకం కింద ప్రతి సంవత్సరం రూ.15000 అకౌంట్‌లో జమ చేశారు. 'మా అబ్బాయి చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది.. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటామని' నాగరత్న అంటోంది.



వైఎస్ఆర్ జిల్లా కడప నగరం మోచంపేటలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్స తీసుకుంటున్న ఈమె పేరు జి. సరోజ. ఈమె గర్భిణీ. స్థానికంగానే నివాసముంటున్న ఈమె ప్రతి 15రోజులకోసారి రక్తహీనత పరీక్షలు చేసుకుంటుంది. వైద్యులు కూడా ఆమెకు దగ్గరుండి పరీక్షలు చేసి ఎప్పటికప్పుడూ సలహాలతో పాటు మందులూ అందజేస్తుంటారు. దగ్గర్లోనే ఆస్పత్రి ఉండడంతో తనలాంటి రక్తహీనత గర్భిణులెందరికో చాలా ఉపయోగకరంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తోంది. పైగా ఈ ప్రభుత్వంలో మందులకూ ఎలాంటి కొరత లేదని.. వైద్యులు కూడా దగ్గరుండి మంచి వైద్య సేవలందిస్తున్నారని తెలిపింది.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు సుధాకర్‌రెడ్డి. గుర్రంకొండ మండలంలోని మొరంపల్లెలో ఉంటు న్నాడు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రైతు భరోసా సాయం అందుకుంటూ పంటలు సాగు చేసుకుంటున్నాడు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 'ఇది రైతు ప్రభుత్వం' అని అన్నదాతలంతా కొనియాడుతున్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత

మదనపల్లె : పాము కాటుతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. తంబళ్లపల్లె మండలం రామిగానిపల్లెకు చెందిన పి.శశికళ(21) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. మంగళవారం రాత్రి స్వగ్రామానికి వచ్చే క్రమంలో గ్రామంలో బస్సు దిగి ఇంటికి వెళుతుండగా దారిలో పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు, కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా ములకలచెరువు మండలం సోంపల్లికి చెందిన బాబాఫకృద్దీన్ కుమారుడు ఉస్మాన్‌ఖాన్ (13)మంగవారం రాత్రి వారు ఉంటున్న వీధిలోనే చిల్లర దుకాణానికి వెళ్లి వస్తుండగా దారిలో పాముకాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. చికిత్సలు అనంతరం బాధితులు కోలుకుంటున్నారు.

వరకట్నం కేసులో ఏడాది జైలు

బి.కొత్తకోట : వరకట్నం కేసులో మదనపల్లెకు చెందిన శంకర్‌కు ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ మదనపల్లె అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి జిసి అసీఫా సుల్తానా తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన రుక్మిణి తన కుమార్తెను మదనపల్లెకు చెందిన శంకర్‌కు 2011లో పెళ్లి చేశారు. కొన్నాళ్లు కాపురం సజావుగా సాగినా.. ఆ తర్వాత నుంచి శంకర్ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. దీంతో 2013లో అప్పటి బి.కొత్తకోట ఎస్‌ఐ సుకుమార్ కేసు నమోదు చేశారు. దీనిపై కోర్టులో పూర్వాపరాలు విచారణ చేసిన జడ్జి నిందితుడు శంకర్‌కు ఏడాది జైలు, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

భార్యపై భర్త దాడి

మదనపల్లె : భార్యపై భర్త దాడి చేసి ఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. పట్టణంలోని సుబ్బయ్యపేటకు చెందిన వినోద్ ఓ బార్‌లో పని చేస్తూ జీవిస్తున్నాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో భార్య ప్రియ(22) భర్తను నిలదీసింది. దీంతో ఆగ్రహించిన వినోద్ భార్యను చితకబాదాడు. దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పతికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా తాళ్లపాక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


సిద్దేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు


ఏనుగు వాహనం అందజేస్తున్న వెంకటరమణ కుటుంబ సభ్యులు

టీటీడీ ఆధ్వర్యంలో 9 రోజుల పాటు నిర్వహణ

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలిలోని తాళ్లపాక గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకస్వాములు, వేదపండితులు అటు చెన్నకేశవ, ఇటు సిద్దేశ్వరస్వామి ఆలయంలో అంకుర్వారణ పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలజీ, టీటీడీ సిబ్బంది, టీటీడీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి..

తాళ్లపాకలోని చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి జూలై 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10గంటలలోపు శివ, కేశవ ఆలయాల్లో ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో స్వామివార్లు రోజుకొక వాహనాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఏనుగు వాహనం బహూకరణ

తాళ్లపాక ఆలయంలోని శ్రీ సిద్దేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలకు స్థానిక సర్పంచ్ గౌరీశంకర్ సోదరుడు శ్యామలబోయిన వెంకటరమణ ఏనుగు వాహనాన్ని బహూకరించారు. మొదటగా ఈ వాహనాన్ని కొన్నేళ్ల క్రితం వారే తయారు చేయించి ఆలయానికి ఇచ్చారు. అయితే ఈ వాహనం ఉపయోగించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో వెంకటరమణ మళ్లీ రూ.2.40 లక్షలతో ఇత్తడి వాహనాన్ని తయారు చేయించి వేదపండితుల ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీకి ఈ వాహనాన్ని అందజేశారు. అంతకుముందు సర్పంచ్ గౌరీశంకర్ కుటుంబ సభ్యులు చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు నరేష్, మహేష్, భక్తవత్సలంతోపాటు గ్రామస్తులు శ్యామనబోయిన మురళీ, గంగయ్య, నాగభూషణం, సుబ్బరాయుడు, రమణయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

రాయచోటి : రాష్ట్ర స్థాయి ఆల్ ఇండియా క్విజ్ పోటీలకు అన్నమయ్య జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటిలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ఆల్ ఇండియా ఆర్‌బీఐ క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈనెల 21న మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటిగా ఇద్దరు విద్యార్థుల వంతున జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగింది. బుధవారం జిల్లా స్థాయి పోటీలలో 30 మండలాల నుంచి 60 మంది విద్యార్థులు క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్.స్పందన, జి. జగన్నాథ్ మొదటి బహుమతి గెలుచుకున్నారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలను విశాఖపట్నంలో జూలై నెలలో నిర్వహించడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో మెడల్స్, జామెంటరీ బాక్సులు ఇవ్వడం జరిగిందని ఎల్‌డీఎం పేర్కొన్నారు.

పెప్సీ గోడౌన్‌పై దాడి కేసులో నలుగురి అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండాయపల్లి సమీపంలో వున్న పెప్సీ గోడౌన్‌పై ఈ నెల 19న సాయంత్రం కొంత మంది ఆకతాయిలు దాడి చేసిన సంఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో చిన్నచౌక్ సీఐ శ్రీరామ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన రెండు రోజుల్లోనే 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈనెల 27న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం ఈ కేసులో నిందితులైన డిగ్రీ విద్యార్థి కల్లూరు మల్లికార్జునరెడ్డి, అలియాస్ మల్లి, తిలక్‌నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి దండిపోయిన శివ అలియాస్ శివయాదవ్, మరో విద్యార్థి మాసాపేటకు చెందిన మున్నంగి రాజేష్ అలియాస్ మాసాపేట రాజేష్‌లను అరెస్ట్ చేశారు. మరో బాలుడిని ప్రభుత్వ బాలుర గృహంకు తరలించారు. ఈ సంఘటనలో పరారీలో వున్న ప్రధాన నిందితుడు వెంకటేశ్వర్‌నాయుడు, ఓ టివి చానెల్ (సాక్షి కాదు) మాజీ టౌన్ విలేకరి, ఇంకా కొందరు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు.

యువకుడిపై దాడి

పీలేరు రూరల్ : బజాజ్ ఫైనాన్స్ సిబ్బంది దాడిలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలిలా వున్నాయి. పద్మావతి నగర్‌కు చెందిన ఎస్.వినోద్ కుమార్ (30) బజాజ్ ఫైనాన్స్‌లో రూ. 21 వేలకు టీవీ కొనుగోలు చేశారు. పది ఈఎంఐలు ఉండగా ఆరు ఈఎంఐలు చెల్లించాడు. ఈ నెల చెల్లించలేదని ఫైనాన్స్ సిబ్బంది అతని ఇంటి వద్దకు వెళ్లి దాడి చేశారు. గాయపడ్డ వినోద్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

కలకడ : దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాలక్రిష్ణ తెలిపారు. ఏఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మండలంలోని దేవులపల్లె పంచాయతీ దళితవాడకు చెందిన రెడ్డెప్ప భార్య నాగమణిని అదే గ్రామానికి చెందిన గంగులయ్య అతని అనుచరులు ఏడుగురితో కలిసి భూమి ఆక్రమించి కొట్టి గాయపరిచారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గండికోట జలాలతో తాగునీటి సమస్య పరిష్కారం


సచివాలయ భవనం ప్రారంభంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : గండికోట జలశాయం నీటితో గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు వైఎస్సార్ జిల్లాలోని గండికోట జలాశయం నుంచి నీటిని వాటర్ గ్రిడ్ ద్వారా అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.2375 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి అయిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. గండికోట జలశాయం నుంచి వాటర్ పైపులైన్లు గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లె వద్దకు వస్తాయన్నారు. అక్కడ తాగునీటి శుద్ధి ప్లాంట్(డబ్ల్యూటీపీ) లో శుద్ధి చేసి నాలుగు నియోజకవర్గాలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. తద్వారా జిల్లాలోని 21 పడమటి మండలాలతోపాటు మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటీలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా అందిస్తామన్నారు. భవిష్యత్‌లో ఎప్పుడు కూడా నాలుగు నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కారం చూపిస్తామన్నారు. ప్రజలు మాటలు చెప్పే వారికన్నా పని చేసే వారినే ఆదరించాలన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా నవరత్నాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

సచివాలయం, ఆర్బీకేల ప్రారంభం

మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీలో రూ.62 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజలు తమ సమస్యలను సొంత ప్రాంతంలోనే పరిష్కరించుకునే అవకాశం లభించిందన్నారు. రైతులు పంటలు పండించుకోవడానికి అవసరమైన వాటిని ఆర్బీకేల ద్వారా సమకూర్చుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్ పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి


మాట్లాడుతున్న కళావతి

మదనపల్లె : మాకు న్యాయం చేయాలని రామసముద్రం మండలం కాప్పల్లె పంచాయతీ గజ్జెలవారిపల్లెకు చెందిన కళావతి వేడుకుంది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడింది. తాము కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడిపే వారిమని తెలిపారు.

స్వగ్రామంలో ఉపాధి కరువవడంతో జీవనోపాధికి బెంగళూరుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈక్రమంలో డ్వాక్రా గ్రూపులు, స్థానికంగా అప్పులు చేసి కొనుగోలు చేసిన నాలుగులక్షల విలువైన ఆవులను గ్రామస్తుడైన రాజప్పకు అప్పగించి, వాటిని మేపి వాటి ద్వారా వచ్చే పాలను అమ్ముకోవాల్సిందిగా చెప్పి వెళ్లామన్నారు. ఆవులను మేపేందుకు ఇచ్చి వెళుతున్నామని, అమ్మలేదని గ్రామస్తులందరి సమక్షంలోనే ఇచ్చామన్నారు. రెండేళ్ల తర్వాత గ్రామానికి చేరుకుని ఆవులను అప్పగించమని కోరితే ఆవులు తనవేనని, ఇచ్చేది లేదని మొండికేశాడన్నారు. దీనిపై గ్రామస్తుల సమక్షంలో పంచాయితీ నిర్వహిస్తే 4 ఆవులు రెండు ఈతల్లో దూడల ద్వారా మొత్తం రూ.10 లక్షల ఆదాయం వచ్చిందని, దూడలు కళావతికి ఇవ్వాలని పెద్దమనుషులు తీర్మానించినా రాజప్ప ఇవ్వలేదని చెప్పారు. దీంతో న్యాయం కోసం ఏడు నెలలుగా రామసముద్రం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగడం జరిగిందన్నారు. అక్కడ న్యాయం జరగకపోతే సబ్ కలెక్టరేట్‌లో స్పందనలో, జిల్లా కేంద్రం రాయచోటిలో ఎస్పీకి విన్నవించుకోవడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ.. కళావతికి న్యాయం చేయాల్సిందిగా పోలీసులను ఆదేశిస్తే.. ఎక్కడ ఆవులను అప్పగించాల్సి వస్తుందోనని, రాజప్ప విషం తాగినట్లు ఆత్మహత్య నాటకం ఆడి తప్పించుకునే ప్రయత్నం చేశాడన్నారు. కొత్తగా తమకు రాజప్ప అప్పు ఇచ్చినట్లు, డబ్బుల వసూళ్లలో భాగంగా ఆవులను తీసుకున్నట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని వాపోయారు. దీనిపై పోలీసులు తమ గ్రామంలో విచారణ చేస్తే నిజాలు బయటపడుతాయని వివరించారు.

రేషన్ స్కాంలో ప్రధాన నిందితుడి అరెస్ట్

- రూ.4.60 కోట్ల ప్రజాపంపిణీ సరుకులు గోడౌన్‌కు తరలించకుండానే మాయం
- పరారీలో ఉన్న ఏ–1 నిందితుడు డీటీ హరిప్రసాద్ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప, చిత్రంలో సీఐ సాదిక్‌అలీ

మదనపల్లె : తంబళ్లపల్లె సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో జరిగిన భారీ రేషన్ స్కాంకు సంబంధించి గుట్టువీడింది. స్కాంలో ప్రధాన నిందితులైన ఏ–1 డిప్యూటీ తహసీల్దార్ పసుపులేటి హరిప్రసాద్‌ను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కేశప్ప, ములకలచెరువు సీఐ సాదిక్‌అలీ వివరాలను వెల్లడించారు. జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ కె.శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు తంబళ్లపల్లె ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు సంబంధించి పీడీఎస్ స్టాక్ గోడౌన్‌కు రాకుండా బయట వ్యాపారస్తులకు తరలించి అక్రమాలకు పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేశామన్నారు. ఇందులో ప్రధాన నిందితులైన డిప్యూటీ తహసీల్దార్ పసుపులేటి హరిప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ సదాశివలు ఇద్దరూ తంబళ్లపల్లె సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో విధులు నిర్వహిస్తుండేవారు. అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించాలనే దురాశతో, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ ఇద్దరూ కలిసి ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి గోడౌన్‌కు వచ్చే పీడీఎస్ స్టాక్ అయిన బియ్యం, కందిపప్పు, చక్కెర, పామోలిన్ ఆయిల్ తదితర సరుకులను రేషన్‌షాపులకు పంపకుండా బయటకు తరలించారన్నారు. 2022 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మూడునెలలు పీడీఎస్ సరుకులను గోడౌన్‌లో దించకుండానే బయటి వ్యాపారులకు అమ్మివేసి, సరుకును రేషన్‌షాపులకు తరలించినట్లుగా తప్పుడు రిపోర్టులు తయారు చేశారు. దీనిపై తంబళ్లపల్లె, పెద్దమండ్యంకు చెందిన రేషన్‌డీలర్లు రేషన్ సరుకులు స్టాక్ పాయింట్ నుంచి ఈ–పోస్ ద్వారా డిస్పాచ్ అయినట్లు ఉందని, వాస్తవానికి తమకు రేషన్ సరుకులు అందలేదని, రిలీజింగ్ ఆర్డర్స్ ఇవ్వడం లేదని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. దీనిపై పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ గిరీషా ఆర్డీఓ మురళీ, డీఎం శ్రీనివాసులు, డీఎస్‌ఓ రఘురాంతో కూడిన ముగ్గురు సభ్యులను విచారణ బృందంగా ఏర్పాటు చేశారు. వీరు 15 రోజులుగా రేషన్‌బియ్యం స్కాంపై పలుకోణాల్లో సమగ్ర విచారణ చేపట్టారు. మూడు నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే 7,704.46 క్వింటాళ్ల సార్టెక్స్ రైస్, కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసే నాన్ సార్టెక్స్ రైస్ 3,094.3 క్వింటాళ్లు, మిడ్‌డే మీల్స్, హాస్టల్‌కు సరఫరా చేసే ఫోర్టిఫైడ్ రైస్ 51.07 క్వింటాళ్లు, చక్కెర 38 క్వింటాళ్లు, కందిపప్పు 208.76 క్వింటాళ్లు, 223 లీటర్ల పామోలిన్ ఆయిల్.. వీటి మొత్తం విలువ సుమారు రూ.4,60,66,106లుగా తేల్చారు. పేదలకు, బడిపిల్లలకు అందాల్సిన ప్రభుత్వ బియ్యాన్ని ప్రభుత్వ అధికారిగా ఉంటూ కంచె చేను మేసిన చందాన డిప్యూటీ తహసీల్దార్ పసుపులేటిహరిప్రసాద్ నమ్మకద్రోహం చేసినట్లుగా గుర్తించారు. విచారణ బృందం దర్యాప్తులో వెలుగు చూసిన అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఆయన ఆదేశాల మేరకు రేషన్ స్కాంలో ప్రధాన నిందితులుగా తేలిన డీటీ పసుపులేటి హరిప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ సదాశివపై తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్నారు. దీనిపై విచారణ జరిపిన ములకలచెరువు సీఐ సాదిక్‌అలీ, సివిల్ సప్లయిస్ అధికారులు అందించిన నివేదికలు, సాంకేతిక ఆధారాలను ఆధారంగా చేసుకుని దర్యాప్తు ప్రారంభించారన్నారు. కేసులో ఏ–2గా ఉన్నటువంటి కంప్యూటర్ ఆపరేటర్ సదాశివ తంబళ్లపల్లె సివిల్‌కోర్టులో న్యాయమూర్తి ఉమర్‌ఫరూక్ ఎదుట లొంగిపోవడంతో ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఏ–1 నిందితుడు డీటీ హరిప్రసాద్‌పై కేసు నమోదవ్వడంతో విధుల నుంచి సస్పెండ్ అయి పరారీలో ఉన్నాడన్నారు. కోర్టులో యాంటిసిపేటరి బెయిల్‌కు ప్రయత్నిస్తున్నాడన్న సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు మదనపల్లె టౌన్ గొల్లపల్లె క్రాస్ వద్ద డీటీ హరిప్రసాద్‌ను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ స్థాయి అధికారి హోదాలో తాను, ములకలచెరువు సీఐ సాదిక్ అలీ పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, కేసు దర్యాప్తులో ఉందన్నారు. డీటీ హరిప్రసాద్‌ను రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్


ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బి. కొత్తకోట : ఎర్రచందనం కేసులో ఏడాదిగా తప్పించుకుని తిరుగుతున్న స్మగ్లర్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు బి.కొత్తకోట ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. గత ఏడాది లక్కిరెడ్డిపల్లెకు చెందిన పవన్ అతని అన్న కొండల స్వామి అలియాస్ సుదర్శన్ క్వాలిస్ వాహనంలో ఎర్రచందనం తరలిస్తుండగా మండలంలోని శంకరాపురం వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. ఎనిమిది ఎర్రచందనం దుంగలతో పాటు పైలెట్‌గా వెళుతున్న మరో రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ఎనిమిది మంది ఎర్రచందనం కూలీలు, స్మగ్లర్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. అప్పట్లో ప్రధాన నిందితుడైన కొండల స్వామి అలియాస్ సుదర్శన్ తప్పించుకుని పారిపోయారు. అప్పటి నుంచి పోలీసులు ఇతనిపై నిఘా ఉంచారు. బుధవారం కాండ్లమడుగు వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘మెడికల్ అండ్ హెల్త్’లో సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు

కడప రూరల్ : కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో సీనియర్ అసిస్టెంట్స్‌గా పని చేస్తున్న నలుగురు ఉద్యోగులకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కడప సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న ఏ క్రిష్ణను కడప రిమ్స్ మెడికల్ కాలేజీకి, వైఎస్సార్ జిల్లా లింగాల పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎస్.వెంకటసుబ్బమ్మను కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, అన్నమయ్య జిల్లా రేగల్లు పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎస్‌ఎమ్ సునీతను కడప సర్వజన ఆసుపత్రికి, అనంతపురం సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న టీ శ్రీనివాస కుమార్‌ను అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పదోన్నతులు ఇచ్చి, పోస్టింగ్‌లు కల్పించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సల, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అల్తావుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో జిల్లా జడ్జి


ఆలయంలోని బలిపీఠానికి నమస్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను కడప జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, గర్భాలయంలోని మూల మూర్తులైన సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో వారు కాసేపు సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, ఒంటిమిట్ట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.వి.రమణ, ఎస్‌ఐ మధుసూదన్‌రావు, ఆలయ టీటీడీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి సంబంధించి మే–జూన్ నెల మధ్య హుండీ ఆదాయం రూ.7,52,927 అని ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు తెలిపారు. ఆలయ రంగమండపంలో స్వామి వారి హుండీ కానులకు ఉంచి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు సమక్షంలో టీటీడీ సిబ్బంది లెక్కింపు చేశారు.

మోటారు ట్రాన్స్‌పోర్టు ప్రాంగణం పరిశీలన


మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగాన్ని పరిశీలిస్తున్న కర్నూలు రేంజి డీఐజీ వెంకటేశ్వర్లు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్టు ప్రాంగణాన్ని బుధవారం కర్నూల్ రేంజి ఏపీఎస్పీ బెటాలియన్‌ల–3 డిఐజి సి.హెచ్.వెంకటేశ్వర్లు పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మూడవ రోజు బెటాలియన్‌లోని దుర్గమ్మ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగాన్ని తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమాండెంటు ఎన్.శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంటు కె.ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి.కేశవరెడ్డి, కె.వెంకట్‌రెడ్డి, పి.ఎన్.డి. ప్రసాద్, వి.జయప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, ఏఆర్ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.